
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 6 మే 2023
5
తూర్పుగోదావరి



నగరంలో అక్రమ కట్టడాల తొలగింపు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

అనుమతుల్లేని భవనాలు, నిర్మాణాలను నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బంది శుక్రవారం తొలగించారు. పట్టణ ప్రణాళికా విభాగపు సిబ్బందితో రాజమహేంద్రవరం నగరంలోని కొన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న కొన్ని భవనాలను తనిఖీ చేయగా ఆమోదించిన ప్లానుకు భిన్నంగా, అనధికారికంగా నిర్మించిన అదనపు కట్టడాలను గుర్తించారు. కంభం సత్రం వీధి, టౌన్ హాలు రోడ్డుల్లో నిర్మించిన అనధికార, అదనపు అంతస్తులను తొలగించారు. నగరంలోని ఇతర ప్రాంతాల్లో అనుమతికి భిన్నంగా ముగా నిర్మించిన అనధికార అంతస్తులను ప్రతిరోజూ ఈ కార్యాలయపు సిబ్బందితో తొలగిస్తారని తెలిపారు.

తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనాల్సిందే

ప్రజాశక్తి-కడియం

అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం కడియం ఆవ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. తడిసిన, మొలకలెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తూ రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు రైతు దగా కేంద్రాలుగా మారాయని, క్లస్టర్ మిల్లింగ్ అంటూ కమీషన్ల కోసం ప్రభుత్వానికి కావాల్సిన మిల్లులకు ధాన్యాన్ని అమ్మమంటూ రైతులను వేధిస్తున్నారని చెపాపరు. రైతులు పండించిన ధాన్యాన్ని స్థానిక రైస్ మిల్లులకు కాక, సుదూర ప్రాంతాల రైస్ మిల్లులకు అమ్మమంటున్నారని, అక్కడ రైస్ మిల్లుల వారు దోపిడీ చేస్తుంటే వారితో ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై సెటిల్‌మెంట్‌లు చేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉండగా పలుమార్లు తడిసిన, మొలకలెత్తిన, బాతులు కూడా తినని ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుకు అండగా నిలిచామని గుర్తు చేశారు. ప్రధానంగా ఆవ ప్రాంత ముంపు సమస్యకు మేజర్ డ్రెయిన్ అవసరం ఉందని, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే సమస్య పరిష్కరిస్తామన్నారు. రైతులు అధైర్య పడవద్దని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అన్ని వ్యవస్థలనూ భ్రష్టు పట్టిస్తున్న సైకో ముఖ్యమంత్రిని సాగనంపాలని రైతులకు పిలుపునిచ్చారు. ఇప్పుడు రాజకీయాలు మాట్లాడబోనని, రైతులకు అండగా నిలిచి జరుగుతున్న అన్యాయాలను, దోపిడీని ప్రభుత్వం దష్టికి తీసుకువచ్చి



కడియంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబు

రైతులకు మేలు చేసేందుకే తాను వచ్చానని, సమయం తక్కువగా ఉందని, అన్ని విషయాలు కూలంకుషంగా తరువాత మాట్లాడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నందేవుల చంటి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కెఎస్.జవహర్, ప్రత్తిపాటి రామారావు చౌదరి, చెల్లుబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్క్సిజమే ప్రపంచానికి దిక్సూచి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మర్క్స్ సిద్ధాంతమే ప్రపంచానికి దిక్సూచి అని, పెట్టుబడిదారీ విధానాలే ఆర్థిక మాంద్యానికి కారణమని ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు పి.సతీష్ అన్నారు. శుక్రవారం రాజమండ్రిలో పేపర్ మిల్ వద్ద గల బిటిఆర్ భవన్‌లో ప్రపంచ మేధావి కారల్ మార్క్స్ 205వ జయంతి సందర్భంగా ఆర్థిక మాంద్యం, ప్రాంచదేశాలు అనే అంశంపై సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభానికి ముందు కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులార్పించారు. అనంతరం జరిగిన సదస్సులో పి.సతీష్ మాట్లాడుతూ ప్రపంచాన్ని అనేకమంది తత్త్వవేతలు విశ్లేషించారని, కారల్ మార్క్స్ దోపిడీ ఎలా జరుగుతుందో, దోపిడీ పోవాలంటే కార్మిక వర్గం ఐక్యమై పోరాడాలని కమ్యూనిస్టు మానిఫెస్టోలో వివరించారని చెప్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థ నిరంతరం సంక్షోభాల్లో ఉంటుందని, అది అనుసరిస్తున్న విధానాలే అందుకు కారణమని వివరించారు. కార్మికులను బానిసలుగా చేసి వారి శ్రమను దోచుకుని లాభాలు గడిస్తుందని, కార్మికులు పనిగంటల పెంచి వేతనాలు తగ్గించి పెట్టుబడి పోగు పడటంతో, కార్మికుల్లో కొనుగోలు శక్తి లేక ఆర్థిక సంక్షోబాలు ఏర్పడతాయని మార్క్స్ ఆనాడే చెప్పారన్నారు. ప్రస్తుతం ప్రపంచం ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతుందని, 2008లో అమెరికాలో వచ్చిన ఆర్థిక సంక్షోభం ప్రపంచాన్ని



మార్క్స్‌కు నివాళి అర్పిస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

అతలాకుతలం చేస్తుందని ఈ సంక్షోభం దాటికి అనేక పెట్టుబడిదారీ దేశాలు దివాళా తీశాయన్నారు. భారతదేశంలో స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో ఏర్పాటు చేసిన ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారీ విధానాలు వేగవంతంతో ప్రైవేటుకు తెగ నమ్ముతుందన్నారు. భారతదేశం నేడు సంక్షోభ ఛాయలు కనిపిస్తున్నాయని, రానున్న రోజుల్లో సంక్షోభంలో కూరుకుపోతుందని, అందుకు మోడీ ప్రభుత్వ విధానాలే కారణమని అన్నారు. ఈ తరుణంలో కారల్ మార్క్స్ స్ఫూర్తిగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని, పెట్టుబడిదారీ విధానాన్ని తిప్పి కొట్టాలని, కార్మిక వర్గ రాజ్యాల స్థాపనకు పూనుకోవాలని అన్నారు. ఈ సదస్సుకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడారు. ఈ కార్యక్రమంలోఎస్-ఎస్.మూర్తి, పోలిన వెంకటేశ్వరరావు, బి.పవన్, ఐఎస్, రాజు, కష్ణ, వెంకటేశ్వరరావు, శంకర్, రాంబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దేవరపల్లి : ప్రపంచ కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కారల్ మార్క్స్ 205వ జయంతి నేపథ్యంలో దుద్దుకూరులో ప్రగశీల కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో మార్క్స్‌కు ఘనంగా నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పికెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే మస్తాన్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, జానీ, మల్లిమొగ్గల పోసి బాబు, వేముల వెంకటేశ్వరరావు, బంగారయ్య, అబ్బులు పాల్గొన్నారు.

కల్యాణమస్తు, షాదీ తోఫా నిధుల జమ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లాలో వైఎస్ఆర్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా క్రింద 522 మంది లబ్ధిదారులకు రూ.3.82 కోట్ల ఆర్థిక సాయాన్ని పెళ్లి కుమార్తెల తల్లులు ఖాతాలకు జమ చేసినట్టు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా కింద జనవరి, ఫిబ్రవరి, మార్చి 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని నేరుగా వారి ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మాధవీలత, రూడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో వైఎస్ఆర్ కల్యాణమస్తు కింద పేద కుటుంబాలకు చెందిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, వికలాంగులు, భవన నిర్మాణ కార్మికుల ఆడపిల్లలకు వివాహ సమయంలో ఆర్థిక చేయూతనిస్తున్నట్టు తెలిపారు. పేద, నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లల వివాహ సమయంలో సామాజిక బాధ్యతతో రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా నిలుస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత స్పష్టం చేశారు. ఇందుకు కనీస విద్యార్హత 10వ తరగతిగా నిర్ణయించడం ద్వారా విద్య యొక్క అవశ్యకతకు ప్రాధాన్యత



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

ఇచ్చారన్నారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలకు సాధికారత కల్పించాలనే లక్ష్యంతో కులాంతర వివాహాలు చేసుకున్న వధువులకు వారి ఖాతాలోనే, అదే కులంలో వివాహాలు చేసుకున్న వధువులకు వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సహాయాన్ని జగనన్న ప్రభుత్వం వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎస్.సుభాషిణి, ఎపిఎం మాలతి పాల్గొన్నారు.

ధాన్యాన్ని పరిశీలించిన మంత్రి కారుమూరి

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని కానూరులో తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి నాగేశ్వరావు శుక్రవారం పరిశీలించరాఉ. పెండ్యాల ర్యాంపునకు వెళుతున్న సిసి రోడ్డుపై ఉన్న తడిసిన ధాన్యం రాసులను ఆయన పరిశీలించారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నా కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర కల్పించడంతో పాటు మిల్లర్లకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే నిర్దేశించిన లక్ష్యాలకు మించి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు నష్టపోకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చెయ్యమని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. మిల్లర్ల ద్వారా అవసరమైన గన్నీ బ్యాగులను సేకరిస్తున్న చెప్పారు. ఆయన వెంట పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్, జెసి తేజ్ భరత్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, తహశీల్దారు టి.రాజేశ్వరి ఎంపిపి కె.సీతారామ్ ప్రసాద్, కొమ్మిశెట్టి రాము, అనపర్తి సత్తిపండు, కరుటూరి గోపి, తోట సురేష్ పాల్గొన్నారు.



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ఉత్సాహంగా చిన్నారుల వేసవి వినోదం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గోదావరి బాలోత్సవం, రాజమహేంద్రవరం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్లో వేసవి వినోదంకార్యక్రమం శుక్రవారం నుంచి చిన్నారుల ఆట పాటలతో ప్రారంభం అయింది. ఈ సందర్భంగా క్యాంపు నిర్వాహకులు పిఎస్ఎన్.రాజు, పి.తులసి మాట్లాడుతూ ఏడాది పాటు చదువు, పరీక్షలు అంటూ ఒత్తిడికి గురైన చిన్నారులకు ఆ ఒత్తిడి నుంచి సేద తీరడానికి ఈ సెలవుల్లో ఒక ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఈ వేసవి వినోదం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. నేటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు ఈ క్యాంపు ఉంటుందని తెలిపారు. చిన్నారులకు విజ్ఞానంతో పాటు వినోదం కూడా అందించే ఉద్దేశంతో ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ 15 రోజుల పాటు చిన్నారులకు చిత్రలేఖనం, కార్టూన్, హ్యాండ్ రైటింగ్, పాటలు, కథలు చెప్పడం, కోలాటం, డాన్స్, డొమెస్టిక్ వర్క్, టీమ్ గేమ్స్, సెల్ఫ్ డిఫెన్స్, మంట లేని వంట వంటి అనేక అంశాల్లో అవగాహన కల్పిస్తారన్నారు.



వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

హ్యాండ్ రైటింగ్ నిపుణులు రాజేష్ ఖన్నా, డాన్స్ మాస్టర్ రమణ, కరాటే మాస్టర్ సుందర్, కార్టూనిస్ట్ శేఖర్, ఎం.విజయగౌరి, అనిత వివిధ అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కష్ణ మోహన్, కిరణ్మయి, స్వేచ్ఛ, నిశ్చల్ తదితరులు ఉన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొనన ఎంపీ భరత్

ఘనంగా శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి-కడియం

కడియంలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం శ్రీకష్ణ భగవానుని విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర పేపర్ మిల్ యాజమాన్యం సౌజన్యంతో నెలకొల్పిన గోశాలలో ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎంపీ మార్గాని భరత్ రామ్, రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. వీరికి గో సంరక్షణ సమితి అధ్యక్షుడు గిరిజాల బాబు, ఆర్యాపురం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్‌పర్సన్ గిరజాల రామకష్ణ తులసి దంపతులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆర్ఎస్ఎన్.మూర్తి, అన్నందేవుల చంటి, వై.స్టాలిన్, రావిపాటి రామచంద్రరావు, ఈలి గోపాలం, చిక్కాల ఉమామహేశ్వరరావు, ఆలయ ఇఒ వివి.శ్రీనివాసరావు, మండలం నలుమూలల నుంచి వందలాదిగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బస్టాండ్ నిర్మాణ స్థలం పరిశీలన

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురంలో బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఆర్‌టిసి ఇఇ కె.అరుణ్ కుమార్, కొవ్వూరు డిపో మేనేజర్ వైవివిఎన్.కుమార్ శుక్రవారం పరిశీలించారు. స్థానిక బైపాస్ రోడ్డులోని బీరపల్లి స్వామినాథ జానకి, వెంకట రమణారెడ్డి ప్రయాణ ప్రాంగణ నిర్మాణానికి వారి కుమారుడు బీరపల్లి కృష్ణ కిషోర్ 46 సెంట్లు స్థలాన్ని ఉచితంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దీంతో ఆ స్థలాన్ని నిర్మాణానికి పరిశీలించినట్టు తెలిపారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం 46 సెంట్లు భూమికి రూ.4.60 కోట్ల విలువ గల స్థలాన్ని దాతలు ఉచితంగా ఇవ్వడానికి ముందు రావడంతో పలువురు అభినందించారు.



రైతులతో మాట్లాడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నష్టపరిహారం అందేలా చర్యలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అకాల వర్షాల వల్ల పంట దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు తహశీల్దార్ జి.కనకరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని సత్యవాడ, కాల్దారి, వేలివెన్ను తదితర గ్రామాలలో నష్టపోయిన పంటలను వ్యసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావుతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ నాయకులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో బిసి రిజర్వేషన్ కోసం పోరాటం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు ఉద్యమం కొనసాగిస్తామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. నగరంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగిన బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి పార్లమెంట్‌లో బిల్లు పెట్టిస్తామన్నారు. బిసిలకు రాజ్యాధికారం దక్కాలంటే రిజర్వేషన్లు తప్పనిసరిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎపిలో సిఎం జగన్ మోహన్ రెడ్డి బిసిలకు అన్ని విధాలుగా ప్రాధాన్యతాస్తున్నాన్నారు. మంత్రివర్గంతో పాటు రాజ్యసభ, ఎంఎల్‌సి పదవుల్లో బిసిలకు అగ్ర తాంబూలం ఇచ్చారన్నారు. పార్లమెంట్లో బిసి బిల్లు పెట్టేలా అన్ని రాజకీయ పార్టీలనూ కలిసి విజ్ఞప్తులు చేస్తున్నామని



సభలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

తెలిపారు. రాష్ట్రంలో సిఎం జగన్ ఏర్పాటు చేసిన 56 బిసి కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని కృష్ణయ్య చెప్పారు. బిసిల ధర్మ పోరాటానికి అందరూ మద్దతు ఇవ్వాలని కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. బిసిలకు అన్ని రంగాల్లో సమాన వాటా సాధించేవరకు పోరాటం ఆపేది లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు బిసి జనగణనపై తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు రైతులకు చేసిన మేలు ఏమిటి?

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పద్నాలుగేళ్లపాటు సిఎంగా, ప్రతిపక్ష నేతగా దాదాపు 40 ఏళ్ళ పాటు రాజకీయ రంగంలో ఉన్న చంద్రబాబు ఆరుగాలం కష్టించే రైతాంగానికి ఏ ఒక్క మేలైనా చేశారా ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రశ్నించారు. రాజమండ్రి వివిఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల పేరు చెప్పి రెండు రోజులుగా గోదావరి జిల్లాలలో పర్యటిస్తున్న చంద్రబాబు రైతు ద్రోహి అన్నారు. రైతులకు ఏమి అన్యాయం జరిగిందని చంద్రబాబు పరామర్శల డ్రామాకు తెరతీశారన్నారు. చంద్రబాబువన్నీ శవ రాజకీయాలు, వెన్నుపోటు రాజకీయాలేనని ఎంపీ భరత్ విమర్శించారు. బషీర్‌బాగ్ ఘటన ఎవరూ మర్చిపోలేదని, వేలాది మంది రైతులను పొట్టన పెట్టుకున్నది, వేలాది రైతుల ఆత్మహత్యలకు చంద్రబాబు కారణమని ఆరోపించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పినప్పుడు.. తీగలపై బట్టలు ఆరేసుకోవచ్చని ఎద్దేవా చేసింది ఈ చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య చిచ్చు రగిల్చేందుకు చంద్రబాబు పర్యటిస్తున్నారు తప్పిస్తే.. నిజంగా ప్రజలపైనా, రైతుల పైనా ప్రేమతో కాదన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన, మొక్కవొచ్చిన ధాన్యాన్ని సైతం రాష్ట్ర ప్రభుత్వం కొంటోందని, రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించారన్నారు. ఇప్పటి వరకూ సుమారు 5.3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఇంకా 30 లక్షల మెట్రిక్ టన్నులు.. ఆపై ఎంతైనా ధాన్యం కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

రైతులకు ధాన్యం సేకరణ నిధుల జమ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

2022-23 రబీ ధాన్యం సేకరణకు సంబంధించి రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంకు తొలివిడతగా రు.65.33 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రబీ 2022-23 సీజన్‌లో అంచనా వేసిన వరి సేకరణ లక్ష్యం 2.50 లక్షల మెట్రిక్ టన్నులు కాగా 20, 419 మంది రైతుల నుంచి 1,43, 058.559 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు కూపన్‌లను జనరేట్ చేసినట్టు తెలిపారు. ఈ రోజు వరకు 12,392 రైతుల నుండి 11,28,73.240 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. శుక్రవారం కొనుగోలు కేంద్రాల ద్వారా ఆన్ లైన్‌లో 2,959.560 మెట్రిక్ టన్నుల ధాన్యం, ఆఫ్ లైన్ లో 2,932.817 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. తొలి విడతలో ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజులలోపే 4,776 ఎఫ్‌టిఒలకు రూ.65.33 కోట్ల రైతుల బ్యాంకు ఖాతాకు జమ చేసినట్టు చెప్పారు. మరో 9,098 ఎఫ్‌టిఒలకు చెందిన రూ.115.69 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాకు పంపినట్టు తెలిపారు. ఏవైనా సందేహాలు, ఫిర్యాదుల కోసం జిల్లా కార్యాలయం 8309487151, 08832940788 కంట్రోల్ రూమ్‌ను రాత్రి 8.00 గంటల్లోపు సంప్రదించ వచ్చునని తెలిపారు.

ఇన్సులిన్ సిరంజిలు అందజేత

ప్రజాశక్తి- నల్లజర్ల

నల్లజర్లలోని కష్ణా మెడికల్స్ అధినేత, నల్లజర్ల బాపిరాజు 200 మందికి సరిపడా ఇన్సులిన్ సిరంజీలను శుక్రవారం ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావుకు అందజేశారు. కుక్కకాటు, కోతికాటు నిరోధక టీకా మందు వినియోగానికి అవసరమైన 1 ఎంఎల్ సిరంజీలను అందించారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఆసుపత్రికి అవసరమైన ఎటువంటి చిరు సాయమైనా అందించడానికి ఎప్పుడూ తాము సిద్ధంగా ఉన్నామని దాత నల్లజర్ల బాపిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కలిదిండి వెంకట చంద్రశేఖరరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పిడుగు పడి పశువుల మృత్యువాత

ప్రజాశక్తి-పెరవలి

ఖండవల్లి సెంటర్ జాతీయ రహదారి నుంచి పేకేరు వెళ్లే రోడ్డులో ఉన్న పిల్లి రామకష్ణకు చెందిన పాకపై శుక్రవారం పిడుగు పడి నాలుగు మూగ జీవాలు మత్యువాత పడ్డాయి. చనిపోయిన పాడి గేదె, ఆవు, దూడల విలువ సుమారు రూ.2.10 లక్షల ఉంటుందని రెవెన్యూ అధికారి పావని తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎంపిపి కె.సీతారామ్ ప్రసాద్, పశు వైద్యాధికారి డాక్టర్ సల్మా సందర్శించారు. బాధితుని ప్రభుత్వపరంగా సహాయ సహకారం అందిస్తామన్నారు.

కార్టూ'నిజం'



వచ్చే ఎన్నికల్లో కూడా ఈ కాలనీల్లాగే అవుతుందేమో మన పరిస్థితి..!!



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న అనాలయో

నిర్మలమైన మనసుతో జీవితం సుసంపన్నం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మానవుని మనసు నిర్మలంగా ఉంటే జీవితం సుసంపన్నం, ఆనందం అవుతుందని ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మ పీఠం పీఠాధిపతి భంతే అనాలయో అన్నారు. శుక్రవారం బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని బౌద్ధ ధమ్మ పీఠంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఉపన్యసించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనసును పరిశుద్ధంగా ఉంచుకునేందుకు బుద్ధుడు అష్టాంగ మార్గాన్ని బోధించినట్లు తెలిపారు. బౌద్ధ ధమ్మ పీఠం మైత్రేయ బుద్ధ విహారలో బుద్ధిస్ట్ కౌన్సిల్ ఆఫ్ ఎపి శాఖ సంయుక్తంగా మహోత్సవాన్ని నిర్వహిస్తోందని అనాలయో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల వికాస కేంద్రం, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత బోధన అందించిన ఉపాధ్యాయులను సన్మానించారు. బూరుగుపల్లి సుబ్బారావు, మల్లిన సత్య నారాయణ, బూరుగుపల్లి కళారావు, గంటా వెంకట్రావు, చిట్టూరి ఉషారాణి, ఆళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-పెరవలి

తడిసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్స్ రైతులను ఎటువంటి ఇబ్బంది పెట్టకుండా కొనుగోలు తహశీల్దారు టి.రాజేశ్వరి సూచించారు. శుక్రరవారం ఆమె అధ్యక్షతన రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. నిబంధనలు ఉల్లంఘించి రైతులను ఇబ్బందులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు తడిచిన ధాన్యాన్ని ఆఫ్‌లైన్ ద్వారా కొనుగోలు చేసినప్పటికీ 24 గంటల్లోపు ధాన్యం వివరాలు ఆన్‌లైన్‌లో పొందు పరచి రైతు ఎకౌంట్లో సొమ్ము జమ అయ్యేవిధంగా తగు చర్యలు తీసుకున్నామన్నారు. రైతులందరూ విధిగా తడిసిన ధాన్యం రైస్ మిల్లర్స్‌కు తరలించుకునేందుకు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.సీతారాం ప్రసాద్, ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్, అగ్రికల్చర్ అధికారి మేరీ కిరణ్, రైస్ మిల్లర్స్ యూనియన్ నాయకులు యుపిఆర్‌డి నరసింహమూర్తి, కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్లు టెక్నికల్ అసిస్టెంట్లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రెండు లారీలు ఢీ

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం జడ్.రాగంపేట వాటర్ ట్యాంక్ సెంటర్‌లో జాతీయ రహదారిపై డివైడర్ వద్ద రోడ్డు దాటుతున్న లారీని అదే సమయంలో జగ్గంపేట వైపు నుంచి వస్తున్న కంటైనర్ లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ముందు లారీ వెనుక భాగం నుజ్జు అయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు గ్రామపంచాయతీ మాధవరాయుడిపేటకు చెందిన మందపల్లి వీరమ్మ(65) విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఇంటి వద్ద బోరింగ్ కొడుతుండగా విద్యుత్ మోటార్ వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురైందని స్థానికులు తెలిపారు. ఆమె భర్త గతంలోనే మరణించాడని తెలిపారు. అయితే ఈ ఘటనపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని విఆర్ఒ, వీరబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టిడిపి నాయకుడు బాబి మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

రాజానగరం జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని మెర్లపాలెనికి చెందిన సీనియర్ టిడిపి నాయకుడు మెర్ల బాబి మృతి చెందాడు. ఆయన మృతి పట్ల మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాబి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు.

11లోగా ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి - అనపర్తి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు, ఉద్యోగులు ఈ నెల 11వ తేదీలోగా ఇకెవైసిని తప్పనిసరిగా చేయించుకోవాలని అనపర్తి ఉపఖజానా అధికారి దాక్షాయణి ఒక ప్రక టనలో తెలిపారు. ఆధార్ నెంబరుతో లింక్ అయిన ఫోన్‌నెంబరు వెంట తీసుకొసస్తే తమ కార్యాలయంలో ఇకెవైసి చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి -అనపర్తి

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్, ఎమ్‌డి వీరపాండ్యన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్షాల వల్ల అన్నదాతలు పడుతున్న కష్టాల్ని వీరపాండ్యన్‌కు ఎంఎల్ఎ వివరించారు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నియోజకర్గ పరిధిలో చేతికొచ్చిన పంట దక్కకుండా పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. వారికి అండగా నిలిచేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. బొండాలు రకం ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన వీరపాండ్యన్ అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా జెసిని ఆదేశించారని ఎంఎల్ఎ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు.

పొలమూరులో ఘనంగా మదనగోపాలస్వామి కల్యాణం

ప్రజాశక్తి -అనపర్తి

మండలంలోని పొలమూరు రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాల స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వమించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జడ్‌పిటిసి సత్తి గీతావరలక్ష్మి, ఉప సర్పంచి సత్తి సూరారెడ్డి, వ్యాపార వేత్తలు సత్తి బ్రహ్మారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఇబ్బందులు

ప్రజాశక్తి -అనపర్తి

వర్షాలతో అనపర్తి మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు రహదారులు ఎత్తుగా ఉండడం, వాటికి ఆనుకుని ఉన్న లింకు రోడ్లు పల్లంగా ఉండడంతో అవి వర్షపు నీటితో నిండిపోయాయి. దీనికి తోడు డ్రెయినేజీల్లో మురుగునీరు వర్షపునీటితో కలిసి రోడ్లపైకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటిలో వీధులన్నీ కంపుగొడుతున్నాయి. ఎప్పుడు ఏ వ్యాధిసోకుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మహేంద్రవాడ, కొప్పవరం తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

అల్లుకున్న నిర్లక్ష్యం

పెద్దాపురం : స్థానిక 18 వ వార్డు పరిధి పరదేశమ్మ కాలనీ గౌరీ కోనేరు చెరువు గట్టు వీధిలో విద్యుత్ స్తంభాన్ని లతలు అల్లుకుపోతున్నాయి. విద్యుత్తు స్తంభం పైన విద్యుత్ సరఫరాకు సంబంధించిన విద్యుత్ వైర్లకు



సైతం ఈ లతలు అల్లుకుపోయాయి. వీటి ద్వారా విద్యుత్తు ప్రసరణ జరిగితే ప్రమాదాల సంభవిస్తాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్నందున అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

మత్స్యకార సదస్సు వాయిదా

యు.కొత్తపల్లి : ఫిషింగ్ హార్బర్‌లో ఈనెల 6న జరగాల్సిన మత్స్యకార సదస్సును వాయిదా వేశామని వైసిపి మండల అధ్యక్షులు ఆనాల సుదర్శన్ శుక్రవారం తెలిపారు. మంత్రులు సిదిరి అప్పలరాజు, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, పొన్నాడ సతీష్ తదితరులు రావాల్సి ఉన్న కొన్ని కారణాలవల్ల మత్స్యకార సదస్సు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు

అవిడి సర్పంచ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



సర్పంచ్ దాడిలో తీవ్రంగా గాయపడిన సుభాష్

పంచాయతీకార్మికునిపై దాడి అమానుషం
సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమలాపురం

కొత్తపేట మండలం అవిడి పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న దువ్వా ప్రవీణ్‌పై సర్పంచ్ రెడ్డి చంటి, అతని కుమారుడు సుభాష్ దాడి అమానుషమని, వెంటనే వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ అవిడి పంచాయతీలో దువ్వా చంద్రశేఖర్ పారిశుధ్యకార్మికునిగా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా ఆయన అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో చంద్రశేఖర్ కుమారుడు దువ్వా ప్రవీణ్ పనికి వెళ్తున్నాడు. పనిచేస్తున్నా వేతనం ఇవ్వకపోవడంతో ప్రవీణ్ సర్పంచ్‌ను వేడుకొన్నాడు. దీంతో ఆగ్రహానికి గురైన సర్పంచ్ రెడ్డి చంటి, అతని కుమారుడు సుభాష్ కలిసి కార్మికులు ప్రవీణ్‌పై దాడికి దిగారు. ప్రాణం పోయేటట్లు దాడి చేశారు. వేతనాలు ఇవ్వమని వేడుకుంటే ప్రాణం పోయేటట్లు కొడతారా? అని ఆయన ప్రశ్నించారు. కార్మికుల పట్ల, దళితులు పట్ల అతి క్రూరంగా వ్యవహరించిన సర్పంచ్, అతని కుమారునిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించి ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడి పంచాయతీ కార్యదర్శి సమయంలోనే జరిగిందన్నారు. కావునా అతనిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

'ఉపాధి'కి కేంద్రం తూట్లు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఉపాధి హామీ చట్టానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి.దైవవాణి అన్నారు. శుక్రవారం ఆమె నల్లమిల్లి, వేమవరం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో భారీ కోత విధించిందన్నారు. బడ్జెట్లో 20 శాతానికిపైగా గత బకాయిలు చెల్లించడానికే ఖర్చు అవుతుందన్నారు. 100 రోజుల పని కల్పించేందుకు రూ.2.72 లక్షల కోట్లు అవసరమవుతాయన్నారు. వేతన జాబితాలను ఎస్‌సి, ఎస్‌టి, ఇతరులు అనే కేటగిరీలుగా విభజించడం వల్ల పలు చిక్కులు వస్తాయన్నారు. ఇది కార్మికవర్గ ఐక్యతను విచ్చిన్నం చేస్తుందన్నారు. ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగుతుందన్నారు. మోడీ ప్రభుత్వం పేదల కోసం కాకుండా ధనికులు, కార్పొరేట్ ప్రయోజనాల కోసం పనిచేస్తుందని దీనికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పనిదినాలను 200 రోజులకు పెంచాలని, పనికోరే వారందరికీ పని కల్పించాలని, రోజుకు రూ. 600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట పి.ఆనందరావు, సంఘం సభ్యులు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో దైవవాణి



చక్రస్నానంలో పాల్గొన్న ఇఒ, పురోహితులు

ఘనంగా సత్యదేవుని చక్రస్నానం

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం సత్యనారాయణస్వామి కళ్యాణోత్సవాల్లో భాగంగా 6వ రోజైన శుక్రవారం శ్రీచక్రస్నానం, వసంత ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పంపా తీరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వమించారు. అనంతరం దేవస్థానం ఇఒ చంద్రశేఖర్ ఆజాద్, సహాయ కమిషనర్ రమేష్‌బాబు, పాలకమండలి సభ్యులు పేరూరి బదరీ నారాయణలతో పాటు అర్చకులు, పురోహితులు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నూతన వస్త్రాలను ధరింప చేసి వసంతోదకాన్ని స్వామి, అమ్మవార్ల పైన, భక్తులపైన చల్లి ప్రసాదం వితరణ చేశారు. సాయంత్రం వసంతోత్సవాన్ని నిర్వహించారు. ముత్తైదువులకు దంపతి తాంబూలాలు అందజేశారు. తదుపరి స్వామి,అమ్మవార్లతో కలిసి అర్చకులు, పురోహితులు ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు ఒకరిపైఒకరు రంగులు జల్లుకుంటూ వసంతోత్సవం నిర్వహించారు.

వైసిపి నేతల దాడులు దారుణం

ప్రజాశక్తి-కొత్తపేట

ఆవిడి పంచాయతీ పారిశుధ్య కార్మికుడు దువ్వ ప్రవీణ్‌పై వైసిపి నేతల దాడి దారుణమని టిడిపి మండల అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్ అన్నారు. దాడి బాధితులను ఆయన పరామర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వేతనాలు ఇవ్వాలని అడిగినందుకు వైసిపి సర్పంచ్ రెడ్డి వెంకటరామసుబ్రహ్మణ్యం, అతని కుమారుడు, వైసిపి గ్రామ అధ్యక్షుడు సుభాష్ దాడికి దిగడం అమానవీయమన్నారు. ఇది వైసిపి నేతల దాడుల సంస్కృతికి నిదర్శనమన్నారు. బధితునికి మెరుగైన వైద్యం అందించాలి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, దాడికి దిగినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట అవిడి మాజీ సర్పంచ్ రెడ్డి తాతాజీ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బూసి భాస్కరరావు, కార్యదర్శి కుంచే సుధీర్‌బాబు, ఎంపిటిసి సభ్యులు చిత్రపు ఆనందబాబు తదితరులున్నారు.

రైతుకు అన్యాయం : కామన

ప్రజాశక్తి - మండపేట

రైతే ఈదేశానికి వెన్నెముఖ అని అందరూ చెబుతో మరో పక్క రైతుకు అన్యాయం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పట్ల అభిమానం, గౌరవం ఉంటే తక్షణమే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్లు రైతుల నుంచి ఎలాంటి నగదు తీసునకోకుండా, తరుగు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. జిల్లా రైస్ మిల్లర్ల అధ్యక్షులు, స్థానిక ఎంఎల్ఎ కలిసి రైతుల సమస్యలను పరిశీలించి మిల్లర్లతో మాట్లాడాన్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరారు. ట్రాక్టర్ల తొట్టెలకు రిజిస్ట్రేషన్ నెంబరు లేక పోయినా అనుమతి ఇవ్వాలని కోరారు.

తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

వర్షాలకు తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి తెలిపారు. ధాన్యం తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉంటే కిలో చొప్పున తగ్గించి కొనుగోలు చేస్తామన్నారు. మండలంలో వర్షాలకు ముందే 95శాతం కోతలు పూర్తయ్యాయన్నారు. మండలంలోని ఎర్రవరం, సి.రాయవరం గ్రామాల్లో కొంత మేర ధాన్యం తడిసిందన్నారు. తడిసిన ధాన్యంపై 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు మండలంలో 96 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతు భరోసా కేంద్రాల కొనుగోలు చేశామన్నారు. ఆమె వెంట ఎంపిఇఒ దాడిశెట్టి దివ్య, రైతులు ఉన్నారు.

'ఆదిరెడ్డి' కస్టడీ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

టిడిపి నేతలు ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి శ్రీనివాస్‌ల ఐదు రోజుల కస్టడీ కోరుతూ సిఐడి పోలీసులు జిల్లా కోర్టులో వేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి గందం సునీత కొట్టేశారు. నిందితులు తమ విచారణకు సహకరించలేదని, వాస్తవాలు చెప్పలేదని, ఈ కేసులో భారీ మొత్తంలో సొమ్ము పక్కదారి పట్టిందని, ఈ కేసుకు సంబంధించిన అనేక అంశాలపై రాబట్టాల్సి ఉందని ఈ మేరకు ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను ఐదు రోజుల పాటు పోలీసు కస్టడికి ఇవ్వాలని సిఐటియు పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. నిందితుల తరుపున సీనియర్ న్యాయవాది ముప్పాళ్ళ సుబ్బారావు వాదించారు. పోలీసు కస్టడీ పిటిషన్‌లో విచారణ దేనిపై జరుపుతారో స్పష్టత లేదన్నారు. క్రిమినల్ రూల్స్ ఆఫ్ ప్రాక్టీస్ రూల్ 26 ప్రకారం స్పష్టత లేకుండా ఈ వేసిన ఇటువంటి పిటిషన్లను అనుమతించ కూడదన్నారు. అంతేకాకుండా నిందితుల కంపెనీలో ఉన్న అన్ని డ్యాక్యుమెంట్లను వివిధ విచారణ సంస్థలు స్వాధీనం చేసుకున్నాయన్నారు. ఇప్పుడు నిందితులను విచారించినంత మాత్రన్న ఎటు వంటి కొత్త అంశాలు వెలుగు చూసే అవకాశం లేదన్నారు. ఇరువిరి వాదనలు విన్న అనంతరం సిఐడి పోలీసులు వేసిన పిటిషన్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి కొట్టేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

కులమతాలకు అతీతంగా 'ఖిద్మత్' సేవలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కులమతాలకతీతంగా కాకినాడ ఖిద్మత్ కమిటీ సేవలు అందిస్తుందని కమిటీ అధ్యక్షులు చిష్టి, కార్యదర్శి హుస్సేన్ తెలిపారు. ఈనెల 6న భైరవపాలెంలో వివాహం చేసుకోబతున్నా కాకినాడ జగన్నాథపురం గోలీల పేటకు చెందిన ఆది లక్ష్మి అనే యువతికి బీరువా, మొదటి వస్త్రాని వారు అందించారు. తల్లి తండ్రులు లేని కారణంగా స్థానికులు ఆమెకు అండగా నిలిచి వివాహం చేస్తున్నారు. ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకురాగా ఈ సాయం అందించామని చిష్టి తలెఇపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అజ్జు, హసన్ షరీఫ్, నౌషాద్, కమిటీ సభ్యులు ఖాజా, ఏహ్తిషాముదల్ హఖ్, హుస్సేన్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - కాకినాడ

పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాలకు అనుగుణంగా తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల 8 నుంచి జూన్ 6వరకూ వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం జెసి ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులు పాల్గొని శిక్షణ పొంది విజ్ఞానవంతులు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిఎల్ఎన్ఎస్‌వి.ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ఎల్.వెంకటేశ్వరరావు, లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు, సిబ్బంది డి.రవికుమార్, సాయివెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈనెల 8నుంచి జూన్ 11వరకూ జరిగే వేసి విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు విద్యార్థులకు సూచించారు. పాఠశాలల పిల్లలను ఈ శిబిరాలకు పంపాలని కోరుతూ ఆయన శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, ఎంఇఒ సిహెచ్‌వి.సత్యనారాయణలను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకూ ఈ తరగతలు ఉంటాయన్నారు.కథలు వినడం, పుస్తకాలు చదివించడం, చదివిన పుస్తకాలపై సమీక్ష, పెయింటింగు, నృత్యం, స్పోకెన్ ఇంగ్లీష్, పేపర్ క్రాఫ్ట్, సంగీతం వంటి అంశాలపై పిల్లలకు శిక్షణ ఇస్తారన్నారు.

సామర్లకోటలో ప్రత్యేకాధికారి పర్యటన

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న జగనన్నకు చెబుదాం, భారీ వర్షాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కాకినాడ జిల్లాకు నియమించిన ప్రత్యేక అధికారి రాష్ట్ర ట్రాన్స్ పోర్ట్, రహదారులు, భవనాల శాఖ ప్రధాన కార్యదర్శి ప్రద్యుమ్న, జెసి ఇలాక్కియా వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాల తదితర శాఖల అధికారులతో కలిసి శుక్రవారం రాత్రి సామర్లకోట మండలంలో పర్యటించారు. ఉండూరులో ఉన్న దేవి రైస్ మిల్లును తనిఖీ చేసి రైతు భరోసా కేంద్రాల ద్వారా తరలించిన ధాన్యం నిల్వల వివరాలను ప్రత్యేక అధికారిఅడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఉన్న రైతులతో మాట్లాడారు. ఆర్‌బికెల ద్వారాధాన్యం కొనుగోలు ప్రక్రియ, తేమ శాతం, ట్రాన్స్ పోర్ట్, హమాలీల ఛార్జీలు, ఆర్‌బికె మరియూ రైస్ మిల్లుల అనుసంధానం, సేకరించిన మొత్తం ధాన్యం వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ బృందలంలో వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్ కుమార్, పౌరసరఫరాల శాఖ డిఎం డి.పుష్పమణి, ఎడిఎ జివి.పద్మశ్రీ, సామర్లకోట ధాన్యం కొనుగోలు ప్రత్యేక అధికారి పి.వసంత మాధవి, తహశీల్దార్ ఎస్ఎల్ఎన్.కుమారి ఇతర అధికారులు ఉన్నారు.

'నాడు - నేడు' పనుల పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న ఫేజ్-2 'నాడు-నేడు' పనులను కాకినాడ డివిజన్ ఉప విద్యా శాఖ అధికారి ఆర్‌జె.డానియేల్ రాజు శుక్రవారం పరిశీలించారు. హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ ద్వారా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. స్లాబ్ పనులు పూర్తి చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల, జిటి వెల్ఫేర్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. జూన్ 12 నాటికి పనులు పూర్తి అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జడ్‌పి బాలికల ఉన్నతపాఠశాలలో పాఠ్య పుస్తకాల స్టాక్ పాయింట్‌ను ఎంఇఒ వై.శివరామకృష్ణయ్యతో కలిసి పరిశీలించారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకుంటామని డివైఇఒ, ఆర్‌జెడి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తోటకూర సాయి రామకృష్ణ, యు.మీనామాధురి, సిఆర్‌పి శ్రీనివాస్, వార్డ్ సెక్రటరీ ఒదూరి స్వామిశ్రీనివాస్, వి.రాజు తదితరులు పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న డానియేల్

మాదకద్రవ్యాల హబ్‌గా ఎపి : బండారు

ప్రజాశక్తి - ఆలమూరు

మాదకద్రవ్యాల హబ్‌గా ఎపి తయారైందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ప్రతిరోజు కొన్ని లక్షల టన్నుల గంజాయి రాష్ట్రం గుండా రవాణా అవుతుందన్నారు. వైసిపి హయాంలో గంజాయి రవాణా పెరిగిపోయిందన్నారు. తాజాగా మన్యంలోని ముంచంగిపట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో లక్ష్మీపురం వద్ద మే 1న 840 కిలోల గంజాయిని పట్టుకున్నారన్నారు. ఎన్‌సిబి వార్షిక నివేదిక ప్రకారం గంజాయి రవాణాలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందన్నారు. 2021లో 7.5 లక్షల కిలోల గంజాయిని అధికారులు సీజ్ చేస్తే దానిలో రెండు లక్షల కిలోలకు పైగా గంజాయి రాష్ట్రంలోనే పట్టుబడిందన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట నేతలు మెర్ల గోపాలస్వామి, సతీష్, ఇ.సత్తిబాబు, రాయుడు సుధాకర్, ఆకుల రామకృష్ణ, కార్యకర్తలు తదితరులున్నారు.

7న థాయ్ బాక్సింగ్ పోటీలు

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెం సిఆర్‌సి ఆధ్వర్యంలో ఈ నెల 7న రాష్ట్ర స్థాయి ముయి థాయ్ బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ కమిటీ సభ్యులు టి.వెంకటలక్ష్మి, సిహెచ్.నాగరాజు, టి.కిరణ్‌కుమార్. తెలిపారు. ఈ పోటీలు జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో జరుగుతాయన్నారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తున్న సిఆర్‌సి ప్రెసిడెంట్ తాడి నాగమోహన్‌రెడ్డి, సెక్రటరీ కర్రి అశోక్‌రెడ్డి, కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు, ఎ.శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



నివాళులర్పిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి, కమిషనర్ ద్విజ్ గోయల్, సిఐ షణ్ముగం

రమణయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రథమ ప్రాంతీయ పరిపాలనాధికారి దడాల రమణయ్య వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జెండా స్తంభం వద్ద నున్న ఆయన విగ్రహానికి ఆర్ఒఎ ఆర్ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్, సీఐ షణ్ముగంలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చెల్లి గోపీనాథ్, నల్లా సూర్యప్రకాష్ రావు,రమణయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన

స్థానిక పడవలరేవు వీధిలో వేంచేసి ఉన్న శ్రీలలితా దేవి ఆలయంలో అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని కమిటీ సభ్యులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. ముమ్మిడి సత్యానందం దంపతలు లక్ష కుంకు మార్చన పూజను నిర్వహించారు. కార్యక్రమానికి యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

జూన్ 4న కానిస్టేబుల్ వ్రాత పరీక్ష

పుదుచ్చేరి పోలీస్ డిపార్ట్మెంట్ ద్వారా గత మార్చి నెలలో నిర్వహించిన శారీరక దారుఢ్య పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకం కోసం జూన్ 4న (ఆదివారం) పుదుచ్చేరిలో రాత పరీక్ష నిర్వ హించనున్నట్లు ప్రభుత్వ అండర్ సెక్రటరీ ఎం.కన్నన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి హాల్ టికెట్ల డౌన్లోడ్, పరీక్షా వేదికలు మొదలైన వివరాలు త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.



అవార్డు గ్రహీతలకు సత్కారం

పుదుచ్చేరి ప్రభుత్వం ఇచ్చిన ఎంతో ప్రతిష్టాత్మక కలైమామణి అవార్డులను అందుకున్న యానానికి చెందిన నలుగురిని భారతీయ దళిత సాహిత్య అకాడమీ, స్ఫూర్తి సాహితీ సమైక్య సంయుక్తంగా సత్కరించారు. శుక్రవారం స్థానిక సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఈ కార్యక్రమం జరిగింది. నిర్వాహకులు పొనుగుమట్ల విష్ణుమూర్తి, దాట్ల దేవాదానంరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఎఒ మునిస్వామి హాజరయ్యారు. అవార్డు గ్రహీతలు డాక్టర్ వరుగు భాస్కర్‌రెడ్డి, కోరుకొండ ప్రసాద్‌రావు, గ్రంధి సత్యనారాయణమూర్తి, ముమ్మిడి శ్రీవీరనాగప్రసాద్‌లను సత్కరించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఈ అవార్డులు రావడం యానాం ప్రాంతానికి గర్వకారణమన్నారు. వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్ఎఒ నామాడి అప్పారావు, కమిడి ప్రభాకర్‌రావు, సత్యనారాయణమూర్తి, కెవివి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నైటింగేల్‌కు ఘన నివాళి

ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు నర్సింగ్ విద్యార్థులు కొవ్వుత్తులతో నివాళులర్పించారు. మదర్ థెరిసా పోస్ట్ గ్రాడ్యుయేట్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ కళాశాలలో నర్సింగ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఆర్‌కె ఆర్ట్స్ కళాశాలలో నర్సింగ్ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ కనకాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఎఒ ఆర్.మునిస్వామి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతాయన్నారు. అనంతరం విద్యార్థులతో వృత్తిపరమైన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వరుగు భాస్కర్‌రెడ్డి, విజయలక్ష్మి, వేలంగి సత్యశ్రీ, అమీర్, దుర్గేశ్వరి, పద్మ, ధనలక్ష్మి, బాపిరాజు, ప్రభుత్వ ఆసుపత్రి సీనియర్ నర్సులు, నర్సింగ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మార్క్స్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - సామర్లకోట

తత్వవేత్త, ఆర్థిక వేత్త మార్క్స్ 205వ జయంతి సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పాల్గొని మాట్లాడారు. మానవాళి ఉన్నంత కాలం మార్క్స్ సిద్ధాంతం బతికే ఉంటుందన్నారు. సమాజం సోషలిజం వైపు అభివృద్ధి చెందాలంటే పోరాటాలే శరణ్యమన్నారు. ప్రతి ఒక్కరూ మార్క్స్ రచనలను అధ్యయనం చేసి సమాజ పురోగబివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, రామదాసు, రమణ, అర్జున్‌రావు పాల్గొన్నారు.